క్లుప్తంగా

శివాజీ విగ్రహం ఆవిష్కరణ



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం పిప్రిలో ఆదివారం శివాజీ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆవిష్కరించారు. శివాజీ బాటలో అందరూ పయనించి ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



ఆర్మూర్‌టౌన్: బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. విద్య రంగానికి కేటాయించిన బడ్జెట్‌పై తెలంగాణ ఎంపీలు స్పందించాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, కళ్యాణ్, పవన్, మనోజ్, ప్రవీణ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు బొంత నిఖిల్‌ను గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ ఆదిలాబాద్‌లో గత రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్న అఖిల్ ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో మూడో స్థానం సాధించాడని గ్రామస్తులు తెలిపారు. నిఖిల్ జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీడీలు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



రుద్రూర్: ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కరాట రమేశ్ అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం నూతన ముదిరాజ్ మండల కమిటీ ఎన్నిక కోసం గ్రామాల వారిగా అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరడి గంగాధర్, సొప్ప శంకర్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న వేయి నామాల వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి పెర్కిట్‌లో ఆహ్వానపత్రికను ఆదివారం అందజేశారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం భూమి పూజ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లెయిం భోజారెడ్డి, దుమ్మాజి శ్రీనివాస్, ములాకిడి శ్రీనివాస్ రెడ్డి, పెర్కిట్ రమేశ్, గాండ్ల రమేశ్, డాక్టర్ అరుణ్, తోక శ్రీను, మల్లయ్య, మోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్‌లో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు– వేల గొంతుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. మాదిగ సంఘం సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

కుక్కల బెడద.. కోతులతో దడ

- బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- ఆర్మూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరాలో పరిస్థితి దారుణం
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్‌లోని 33వ వార్డులో తిరుగుతున్న కుక్కలు



హుస్నాబాద్ కాలనీలో ఇంటిపై ఉన్న కోతులు



ముప్కాల్: రెంజర్లలో సంచరిస్తున్న కుక్కలు

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ: దారుల్లో శునకాలు.. నివాసాల వద్ద కోతులతో ఆర్మూర్ పట్టణవాసులు సతమతమవుతున్నారు. వాటి దాడులతో గాయాల పాలవుతున్నారు. ఆయా బాధితుల సంఖ్య ఆస్పత్రుల్లో రోజురోజుకు పెరుగుతూనే ఉంది. నడుచుకుంటూ వెళ్లినా, వాహనాలపై ప్రయాణిస్తున్నా వెంబడిస్తున్నాయి. ఆర్మూర్ పట్టణంతో పాటు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో కుక్కల, కోతుల బెడద పెరిగింది. ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డులలో కోతుల, కుక్కల బెడద అధికంగా ఉంది. ఈ వార్డుల్లో నిత్యం ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. కొన్ని రోజుల క్రితం మున్సిపల్ అధికారుల కుక్కల నివారణ చర్యలు చేపట్టినా మధ్యలోనే నిలిపివేశారు. ఉదయం పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో కోతులు పిల్లల బ్యాగులను లాగేస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. చేతిలో కర్ర ఉంటేనే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి తలుపు తెరిచి ఉంటే చాలు లోనికి ప్రవేశించి ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందరగా పాడేస్తున్నాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కుక్కలు ఉదయం వాకింగ్ చేసే వారిపై, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వెంట పడి దాడి చేస్తున్నాయి. అంతేకాకుండా బాల్కొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నాధికారులు స్పందించి కుక్కల, కోతుల బెడదను నివారించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

భయంగా ఉంది

కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నప్పుడు వెంట పడుతున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– తోకల వెంకటేశ్, రెంజర్ల(ముప్కాల్)

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



ట్రస్మా నాయకులను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పెర్కిట్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే పాఠాలు గుర్తుండిపోతాయని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. పెర్కిట్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ఆదివారం ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు చైతన్య సదస్సు విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలన్నారు. అనంతరం పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడానికి ఎలా చదవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ట్రస్మా నాయకులను అసోసియేషన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రమేశ్ రావు, రాఘవేందర్ రెడ్డి, మల్లయ్య, ప్రవీణ్ పవార్, వేణు, భాషిత సుందర్, కాంతి గంగారెడ్డి, మానస గణేశ్, నలంద ప్రసాద్, నందా సాగర్, లిల్లిపుట్ రామకృష్ణ, విద్యా గోపి, జెంటిల్ కిడ్ ప్రకాశ్, కలిగోట్ సిద్ధార్థ గంగా రెడ్డి, మధుసూదన్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుపుబోర్డుకు నిధులు కేటాయించాలి

వేల్పూర్: నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పసుపుబోర్డుకు ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమని బీఆర్‌ఎస్ రైతు విభాగం జిల్లా నాయకుడు మిట్టపల్లి మహిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన జాతీయస్థాయి పసుపుబోర్డుకు ఏ మాత్రం నిధులు కేటాయించకుంటే బోర్డు ఏ విధంగా రైతులకు ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా రైతులు కోరుతున్న పసుపుబోర్డును ఏర్పాటు చేయడం మంచి పరిణామమే అయినప్పటికీ నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు చేయడం వల్ల పసుపు రైతుల కష్టాలు గట్టెక్కినట్లేనని భావించామని, కాని బీజేపీ ప్రభుత్వం బోర్డుకు నిధులివ్వకుండా రైతులను నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. జాతీయస్థాయిలో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు కార్యకలాపాలకు కనీసం రూ. వంద కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సమాజం గర్వించే పౌరులుగా తీర్చిదిద్దాలి



సుర్బిర్యాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజశేఖర్, సభ్యులు

పెర్కిట్: చెడు వ్యసనాలకు గురవుతున్న యువతను సమాజం గర్వించే పౌరులుగా తీర్చిదిద్దడానికి మేధావులు, విద్యావంతులు, రైతులు కలిసి రావాలని ఈరవత్రి రాందాస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, ఫత్తేపూర్ గ్రామాల్లో ఆదివారం ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'హోటల్ కాడికి పోదాం జన సమూహంతో కలుద్దాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ గ్రామస్తులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. యువతను సన్మార్గంలో నడిపించడానికి గురువులు, సమాజ సేవకులు, విద్యావంతులు నడుం బిగించాలన్నారు. అనంతరం రాజశేఖర్‌ను రెండు గ్రామాల నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ నర్సయ్య, అర్గుల్ సురేశ్, రజనీశ్, గంగామోహన్, బదాం రాజ్ కుమార్, సైపుద్దీన్, ఇస్తాకుద్దీన్, కొండి రాంచందర్, కె రాంప్రసాద్, నూకల శేఖర్, దోమల శ్రీనివాస్, నటరాజ్, రమేశ్ గౌడ్, గంగామోహన్ చక్రు, గోపి కృష్ణ, సాయా రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మేకల శ్రీనివాస్, మేకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



రెంజల్: మండలంలోని బోర్గాంలో బాధితుడికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బోధన్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్‌యాదవ్, నాయకులు చిరడి రవి, సిద్ధ సాయిలు, గైని కిరణ్, సంజీవ్, హన్మాండ్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నల్లపోచమ్మ ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. సర్వసమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పెద్దబజార్‌లో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



పెర్కిట్/ బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్‌తో పాటు ఆలూర్ మండలంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వీడీసీ సభ్యులు ఎస్సారెస్పీ నుంచి తీసుకొచ్చిన గంగాజలాలతో గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతకుల జలాభిషేకం చేశారు. బాల్కొండ మండల కేంద్రంలో గ్రామస్తులు గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని పెద్ద పోచమ్మ, హనుమాన్, అయ్యప్ప, మల్లన్న స్వామి ఆలయాల్లో జలాభిషేకం చేపట్టారు. ఆలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని సర్వసమజ్ ప్రజా ఐక్య సమితి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు మహాలక్ష్మి, పెద్దమ్మ తల్లి, ముత్యలమ్మ, నల్లపోచమ్మ, గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో హోమం, కలశ స్థాపన, దేవత ఆహ్వానం, పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కుంకుమార్చన, అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఉప్లూర్‌లో..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేటి నుంచి వేంపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ముప్కాల్ మండలం వేంపల్లిలో ఉన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం దేవత ఆహ్వాన పూజ, ధ్వజారోహణం,కలశ స్థాపన,మంగళవారం స్వామి వారి కల్యాణం, రథోత్సవం, బుధవారం నాగవెల్లి, చక్రస్నానం ఉంటుందని అన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చలిబోనాల పండగ

కమ్మర్‌పల్లి/ బాల్కొండ: కమ్మర్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం చలిబోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఊట్లె పోచవ్వ, ఐదు చేతుల పోచవ్వ, నల్ల పోచమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి చలి బోనాలను సమర్పించారు. బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకొని గ్రామ శివారులోని ఆలయాలో పసుపు ఆకుల్లో చలిఅన్నం, బెల్లన్నం, కల్లు సాక, చిలక గుర్రం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు.

నేడు సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని చిన్నారులకు అక్షరభ్యాసం చేయించాలని కోరారు. సాయంత్రం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా జగదాంబ దేవి జాతర

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో జగదాంబ దేవి జాతర ఘనంగా జరిగింది. వసంత పంచమిని పురస్కరించుకొని అమ్మవారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం రథయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు.

వ్యవసాయదారుల సంఘం దేశానికి ఆదర్శం

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేతో నాయకులు, గ్రామస్తులు

మోర్తాడ్: మండల కేంద్రంగా కొనసాగుతున్న వ్యవసాయదారుల సంఘం రాష్ట్రం, దేశవ్యాప్తంగా ఎంతో ఆదర్శవంతమైనదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. పంటలను పండించే ప్రతి ఒక్కరికి గుర్తింపు తీసుకు రావడం కోసం స్థాపించిన వ్యవసాయదారుల సంఘం విస్తరింపజేయాలని ఆయన సూచించారు. ఆదివారం మోర్తాడ్‌కు ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన ఇక్కడ ప్రతిష్ఠించిన వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. రైతుల కోసం ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేసి వారికి గుర్తింపును తీసుకరావడానికి నర్సారెడ్డి చేసిన కృషిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న రహదారి కష్టాలు



పచ్చలనడ్కుడ–కొత్తపల్లి ఎస్ గ్రామానికి చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణం

వేల్పూర్: మండలంలోని కొత్తపల్లి ఎస్ గ్రామస్తులకు రహదారి కష్టాలు తీరనున్నాయి. పచ్చలనడ్కుడ నుంచి కొత్తపల్లి ఎస్ గ్రామానికి ఉన్న సుమారు మూడు కిలోమీటర్ల దూరం, అక్కడి నుంచి మరో మూడున్నర కిలోమీటర్ల దూరంలోని చింతలూర్ క్రాస్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రోడ్డుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి 2023లో సుమారు రూ. తొమ్మిది కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో శాసనసభకు ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో పనులు ఆలస్యమయ్యాయి. 2024లో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కంకర వేయడం పూర్తి చేశారు. ప్రస్తుతం తారువేసే పనులు జరుగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే పలు గ్రామస్తులకు ప్రయాణానికి రహదారి మెరుగవుతుంది. పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మాక్లూర్: మండల కేంద్రంలోని శక్తి హనుమాన్ ఆలయంలో 12 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఆలయంలో నిర్వహించిన వేడుకలకు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుజ్జుల హన్మంత్‌రెడ్డి, అనిత, చిటికెల శ్రీనివాస్‌రెడ్డి, మదారి మమత, చింత శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, డీవీ రాములు, రాజేందర్, సత్యం రెడ్డి, విఠల్ సుమన్, రోహిత్, గంగాధర్, రాజేశ్వర్ రావు, పుష్ప, లక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల రంగాన్ని బలోపేతం చేస్తాం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

పెర్కిట్: రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల రంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం ట్రస్మా నిజామాబాద్ జిల్లా అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాదుల మధుసూదన్ మాట్లాడుతూ.. అడ్‌హక్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పనితీరుపై పర్యవేక్షిస్తారన్నారు. నిజామాబాద్ ప్రాంతంలో విద్యారంగాన్ని మెరుగుపరచడానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా క్రాంతి, సభ్యులుగా డి శశిధర్ రావు, ఎల్ ప్రసాద్, ఆర్ రామకృష్ణ, ఎ గంగారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లయ్య, ప్రవీణ్ పవార్, కె వేణు, కాంతి గంగారెడ్డి, మానస గణేశ్, భాషిత సుందర్, అజీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఏజెంట్ గై 001(తెలుగు)-11.10 రాచరికం (తెలుగు)-1.25 మహిష (తెలుగు)-4.15 డాకు మహారాజు(తెలుగు)-6.45 స్కై ఫోర్స్(హిందీ)-9.50
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3	మదగజరాజ(తెలుగు)-10.10 7.10 10.20, స్కై ఫోర్స్(హిందీ)-1.20, డాకు మహారాజు(తెలుగు)-4.05
స్క్రీన్-4	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 12.00, 3.00, 6.00, 9.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40, 4.40, 7.25, 10.00
స్క్రీన్-3	ఏజెంట్ గై 001(తెలుగు)-11.00 4.40 మదగజరాజ(తెలుగు)-1.30 ,7.30 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	మదగజరాజ(తెలుగు)-10.10 10.45 డాకు మహారాజు (తెలుగు)-1.20 7.40 - దేవా(హిందీ)-4.25
స్క్రీన్-3	దేవా(హిందీ)-10.45 7.15 10.30 మహిష(తెలుగు)-2.00 రొమాంటిక్ లైఫ్(తెలుగు)-4.30
స్క్రీన్-4	ఏజెంట్ గై001(తెలుగు)-11.15 స్కై ఫోర్స్(హిందీ)-1.30 10.25 మదగజరాజ(తెలుగు)-4.15 ప్రేమిస్తావా(తెలుగు)-7.25

లలితామహల్	మదగజరాజ (తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	రాచరికం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	84,000	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	76,780		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800